క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేంపల్లె : స్థానిక గాండ్లవీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు శేషగిరిరావు నేతృత్వంలో సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రావణమాస ఆదివారం పురస్కరించుకుని పెద్ద ఎత్తున మహిళలు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు సాంబశివుడు, రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించే మోక్షశాస్త్రమే భాగవతం



మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జానకిరాం శర్మ

సింహాద్రిపురం : ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించే మోక్ష శాస్త్రమే భాగవతమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు తులసిరెడ్డి, జానకిరాంశర్మలు తెలిపారు. ఆదివారం మండలంలోని కసనూరు గ్రామంలో పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు మాట్లాడుతూ భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగవత భక్త సమాజ మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాయల్ కాపునాడు రాయలసీమ యూత్ అధ్యక్షుడిగా మధు



చక్రాయపేట : మండలంలోని కొండావాండ్లపల్లెకు చెందిన రాశినేని మధు రాయల్ కాపునాడు రాయలసీమ యూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు రాయల్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు కావలి కృష్ణతేజ తెలిపారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, మున్నూరు కాపు కుల స్తుల హక్కుల కోసం పోరాడుతానని ఆయన తెలిపారు.

పురాతన కోనేరుకు స్వచ్ఛీకరణ



కోనేరులో పూడికలను తొలగిస్తున్న భక్తులు

చింతకొమ్మదిన్నె : జిల్లాలో పురాతన కాలంలో బృగుమహర్షి తపస్సు చేసుకుంటూ ఆయన చేత నిర్మాణం చేపట్టినట్లుగా భావిస్తున్న కోనేరుకు తిరిగి ఆదివారం స్వచ్ఛీకరణ చేశారు. మండలంలోని బుగ్గలపల్లె సమీపంలోని బుగ్గమల్లేశ్వర ఆలయం ఉంది. ఆలయంలోని దేవతలకు పూజలకు అవసరమైన నీటి కోసం నిర్మించిన కోనేరు శిథిలావస్థకు చేరింది. బుగ్గలపల్లె, నాగిరెడ్డిపల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గ అగ్రహారం, కడప నగరం నుంచి భక్తులు వచ్చి స్వచ్ఛందంగా ఈ కోనేటిలో పూడికను తీశారు. ఈ కార్యక్రమంలో గూడా ప్రభాకరరెడ్డి, సదానందరెడ్డి, బొగ్గడి సుధాకరరెడ్డి, భాస్కరరెడ్డి, చుట్టుపక్కల గ్రామస్తులతోపాటు ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల తనిఖీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న శాప్ డైరెక్టర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివారులోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలను శాప్ డైరెక్టర్ రమణరావు, పేరం రవీంద్రనాథ్ ఆదివారం తనిఖీ చేశారు. ఉదయం క్రీడా పాఠశాలకు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, వసతి ఏవిధంగా ఉన్నాయో పరిశీలించారు. క్రీడా మైదానాలను పరిశీలించి అక్కడ ఉన్న లోటుపాట్లను గుర్తించారు. కోచ్‌లు ఏవిధంగా శిక్షణ ఇస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు కె. జగదీశ్వరి, బొమ్మినేని శివ, క్రీడా పాఠశాల కోచ్‌లు పాల్గొన్నారు.

మూతపడిన సర్కార్ బడి..

- ప్రభుత్వ పాఠశాలలపై సన్నగిల్లుతున్న నమ్మకం
- మరికొన్ని పాఠశాలలు మూతకు సిద్ధం

కొండాపురం : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లడంతో వాటి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనపై ఆసక్తితో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది గణనీయంగా తగ్గి పాఠశాలలు వెలవెలబోతున్నాయి. అరకొరగా కొన్ని గ్రామాల్లో జూన్ మొదటి వారంలో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించినా ఆసక్తి కనబడలేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించేస్తోమత లేనివారు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడంలేదు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా రానందునే పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. మండలంలో 51 పాఠశాలలు ఉండగా ఈ ఏడాదే 2 పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడే దశలో ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో(2025–26) కె.బ్రహ్మణపల్లె, బి.కొత్తపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. మండలంలో ప్రాథమిక పాఠశాలలో కొన్ని చోట్ల ఉపాధ్యాయులు సరిగా హాజరు కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలలు

మండలంలోని దత్తాపురం మెయిన్ పాఠశాలలో 6 మంది పిల్లలు, గంగాపురం పాఠశాలల్లో 6 మంది, కె. వెంకటాపురం పాఠశాల్లో 14 మంది, కొండాపురం మెయిన్ 11 మంది, లావనూరు దళితవాడ పాఠశాలలో 11 మంది, లావనూరు మెయిన్ పాఠశాలలో నలుగురు, నేదరపేట పాఠశాలలో 13 మంది, పొట్టిపాడు ప్రాథమిక పాఠశాలలో 7 మంది, రేపల్లె పాఠశాలలో 8 మంది, ఎస్.కొత్తపల్లి పాఠశాలలో 11 మంది పిల్లలు ఎస్.తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో 13 మంది, టి.కోడూరు మెయిన్ పాఠశాలలో 6 మంది, చెన్నమనేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో 6 మంది ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఘణనీయంగా తగ్గింది. మండలంలోని లావనూరు, కొండాపురం ఉన్నతపాఠశాలలో ఇదే తరహాలో క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

పిలలు లేకపోవడంతోనే పాఠశాలలు తెరవలేదు



మండలంలో బి.కొత్తపల్లె, బ్రహ్మణపల్లె గ్రామాల్లో ఉండే ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలసంఖ్య జీరో ఎన్ రోల్‌మెంట్ ఉండటం వల్ల పాఠశాలలు మూతపడలేదన్నారు. పిల్లలు లేకపోవడంతో పాఠశాలలు తెరవలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నామన్నారు.

– మండల విద్యాశాఖ అధికారి ఓబులేసు



బ్రహ్మణపల్లె గ్రామంలో మూత పడిన ప్రాథమిక పాఠశాల

రేపు పాలిటెక్నిక్ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

కళాశాలలో సివిల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంప్యూటర్, ఎలక్టానిక్ ఇంజనీరింగ్, డిప్లమా కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత అయి పాలీసెట్ 2025 ర్యాంకుతో గానీ సంబంధం లేకుండా దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 5వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు 3 సెట్ల జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. టెన్త్ మార్క్‌లిస్ట్‌తోపాటు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రాలు, టీసీ అందజేయాలన్నారు. ప్రతి ఏడాది రూ.6 వేలు ఫీజు చెల్లించాలన్నారు. బాలురకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం ఉందన్నారు.

గంగమ్మతల్లికి అభిషేకాలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి ఆలయం, శివాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్టుల తనిఖీ

పులివెందుల రూరల్ : ఈనెల 12న జరిగే జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పులివెందుల మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆర్డీఓ చిన్నయ్య, అర్బన్ సీఐ చాంద్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ నజీర్‌అహ్మద్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో పరిశుభ్రంగా ఉంచే విధంగా సంబంధిత సిబ్బందికి సూచించామన్నారు. అలాగే మండల పరిధిలోని కనంపల్లె వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేయడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏవైనా అవాంఛనీ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



కంనపల్లె వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, సీఐ

ఎలక్షన్ ఉన్న గ్రామాలలో ఎవరైనా అనుమానస్పద స్థితిలో తిరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జూదరులు అరెస్టు

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామ సమీపంలో కొంత మంది జూదరులు జూదము ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో ఆరు మంది జూదరులు, పేక ముక్కలు, రూ.9300 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు విజ్ఞప్తి

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం జరిగే వికలాంగుల సహాయ పరికరాల క్యాంపులో గ్రామ సచివాలయ పరిధిలోని వికలాంగులు, వయో వృద్ధులందరూ పాల్గొనాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. అవసరమైన విలువైన సహాయ పరికరాలు వృద్ధులు, వికలాంగులకు వచ్చేటట్లు అన్ని గ్రామాల సచివాలయ ఉద్యోగులు చూడాలని తెలిపారు.

క్రీడా దుస్తులు అందజేత

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్ర ప్రో కబడ్డీ కర్నూల్ నైట్స్ కబడ్డీ టీమ్‌కు క్రీడా దుస్తులను అసోసియేషన్ సభ్యులు గురు శేఖర్, శ్రీవాణి అందజేశారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న కర్నూలు నైట్ ఫ్రాంచెజ్‌కు చెందిన క్రీడాకారులకు ఆదివారం ఈ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రో కబడ్డీ లీగ్‌లో క్రీడాకారులు తమ సత్తా చాటాలన్నారు.

ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితం

కమలాపురం : కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి జీవితం ప్రజా సేవకే అంకితం అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్, ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన 39వ వర్థంతిని పురస్కరించుకుని కమలాపురం క్రాస్ రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి తన జీవితమంతా ప్రజలకే అంకితం చేశారన్నారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ఆయన చివరి శ్వాస వరకు పేదల పక్షాన పోరాడారని గుర్తు చేశారు. 1946లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపినప్పటికి చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పార్టీని నడిపించారన్నారు. 1949–52 మధ్య కమ్యూనిస్ట్ పార్టీపై తీవ్ర నిర్బంధన ఉన్నపుడు ఆయన అజ్ఞాత వాసంలో ఉండగా ఆయనతో పాటు మరో కామ్రేడ్‌ను అరెస్ట్ చేయడానికి 1949 సెప్టెంబర్ 28న పోలీసులు ఆయన గ్రామానికి వచ్చినప్పుడు ప్రజలు తిరుగుబాటు చేసి పోలీసుల కళ్లల్లో కారం కొట్టి, రాళ్లతో దాడి చేశారన్నారు. ఈయన 1915లో పెద్దముడియం మండలం పెద్దపసుపులలో జన్మించారని, కడప జిల్లాకు మెదటి ఎంపీగా 1952లో సీపీఐ తరపున గెలిచారన్నారు. 1958 నుంచి 1962 వరకు ఎంఎల్‌సీగా సేవలందించారన్నారు. ఆ తర్వాత 3 సార్లు ఎంపీగా గెలిచారన్నారు. 1986లో ప్రొద్దుటూరులోని సీపీఐ కార్యాలయంలో కన్ను మూశారన్నారు. ప్రజా పోరాటాలకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన పేరును గండికోట ప్రాజెక్ట్‌కు పెట్టడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

తొండూరులో..

తొండూరు : స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం కామ్రేడ్ దివంగత ఈశ్వరరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ కడవరకు ఆదర్శ కమ్యూనిస్టుగా శ్రమజీవులు అభ్యున్నతికై జీవితాన్ని ధారపోసిన మహా మనిషి కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నమ్మిన సిద్ధాంతాల కోసం మొత్తం ఆస్తిని త్యాగం చేసి ప్రజా శ్రేయస్సుకోసం కృషి చేసిన ప్రజా నాయకుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సీసీఐ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డిలు తెలిపారు. ఆదివారం ఎద్దుల ఈశ్వరరెడ్డి వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 2000–2001 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 24 సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకొని చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తోటి విద్యార్థి మృతి చెందడంతో ఆకుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేదని తెసుకొని తోటి విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. నాడు గురువులు నేర్పిన క్రమ శిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కోలాట ప్రదర్శన

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లెలో నూతనంగా కోలాటం నేర్చుకున్న వారు గజ్జలపూజ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్తులను కార్యక్రమానికి ఆహ్వానించి భోజన సదుపాయాలు ఏర్పాటు చేసి కోలాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



గజ్జల పూజ, కోలాటంలో పాల్గొన్న కళాకారులు

టీడీపీ నాయకులను నిలదీసిన ఎస్సీ కాలనీ వాసులు

పులివెందుల రూరల్ : ఈనెల 12వ తేదీన జరిగే జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కూటమి నాయకులు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, జెడ్పీటీసీ అభ్యర్థి లతారెడ్డిలు ఆదివారం అచ్చివెళ్లి గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

ఎస్సీ కాలనీలో మహిళలు సూపర్ సిక్స్ పథకాలలో 45 ఏళ్లకే పింఛన్, ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని కానీ పథకాలు అమలు చేయకుండా ఇప్పుడు ఓట్ల కోసం ఎలా వచ్చారంటూ మహిళలు వారిని నిలదీశారు. అలాగే తల్లికి వందనం కింద అర్హులైన వారికి డబ్బులు పడలేదని వారు నిలదీశారు. దీంతో అర్హులైన వారందరికి పథకాలు వస్తాయంటూ వారు దాటవేశారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం గుల్లకుంట గ్రామం సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం 5వ తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ–36, ఎస్టీ 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రంతో నేరుగా పాఠశాల వద్దకు వచ్చి సంప్రదించాలని సూచించారు. అర్హులైన పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివకేశవమ్మ తెలిపారు. ఈ కళాశాలలో 35 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని గండి క్షేత్ర సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్లకు సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ సురేంద్రబాబు తెలిపారు. తమ కళాశాలలో 5వ తరగతిలో ఎస్సీ తెగలకు సంబంధించి 22 సీట్లు ఉన్నాయని, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎస్సీ తెగలకు 6 సీట్లు, బీసీ తెగలకు సంబంధించి 2 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాఠశాల వద్దకు వచ్చి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చునన్నారు. స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 8 చివరి తేదీ అని, పూర్తి వివరాలకు 9441737940 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రైతు పాలిట శాపంగా మారిన కృష్ణా జలాలు

- చిన్న వెంతుర్ల సమీపంలో జీఎస్ఎస్ఎస్ కాలువకు లీకేజీ
- దళిత రైతు రాజన్న పొలాన్ని చుట్టూ ముట్టిన కాలువ నీరు
- పట్టించుకోని అధికారులు

మైలవరం : గాలేరు–నగరి సుజల స్రవంతి కాలువ ద్వారా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు వస్తున్న కృష్ణా జలాలు ఓ రైతు పాలిట శాపంగా మారాయి. కొందరు స్వార్థపరులు కాలువకు గండి కొట్టడంతో భారీ ఎత్తున లీకేజీ కావడంతో నీరు పొలాలను చుట్టు ముడుతున్నాయి. ఫలితంగా ఓ పేద రైతుకు చెందిన నాలుగు ఎకరాల భూమిలో మోకాలి లోతు నీళ్ల నిలబడి ఇప్పటికే పొలాన్ని సర్వనాశనం చేశాయి.

అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం చిన్నవెంతుర్ల గ్రామానికి చెందిన మలగిరి రాజన్న అనే దళిత రైతుకు చిన్న వెంతుర్ల–వద్దిరాల రహదారి పక్కనే నాలుగు ఎకరాల సొంత పట్టాభూమి ఉంది. ప్రతి ఏడాది ఆ పొలంలో శనగ పంట సాగు చేసేవాడు. కాగా మూడు రోజుల క్రితం అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల చేశారు. ఈ జలాలు జీఎస్ఎస్ఎస్ కాలువ ద్వారా ప్రవహిస్తుంది. నంద్యాల జిల్లా దాటి కడప జిల్లాలోనికి ప్రవేశిస్తున్న ప్రాంతంలో జీఎస్ఎస్ఎస్ కాలువకు కొందరు స్వార్థపరులైన రైతులు రంధ్రం వేశారు. ఇది గతంలోనే జరిగినా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కాలువ నిండా నీళ్ల ప్రవహిస్తున్నాయి. ఆ రంధ్రం వద్ద నీరు లీకేజి పెరిగి పాల వాగు గుండా వెళ్లతున్నాయి. చిన్న వెంతుర్ల గ్రామానికి చెందిన దళిత రైతు రాజన్నకు పాల వాగు పక్కనే పొలం ఉండటంతో పాల వాగు పొంగి రాజన్న పొలాన్ని చుట్టూ ముట్టాయి. ఆదివారం సాయంత్రం మోకాటిలోతు నీరు పొలంలో నిలపడ్డాయి.



జీఎస్ఎస్ఎస్ కాలువకు గండి పండిన ప్రాంతం ఇదే

ఇప్పటికే ఈ జలాలు రాజన్న పొలాన్ని సర్వనాశనం చేశాయి. నీటి ఉధృతి రోజు రోజుకు మరింత పెరిగే ప్రమాదం ఉంది.



రాజన్న పొలంలో నిలబడ్డ కృష్ణాజలాలు

అధికారులు పట్టించుకోక పోవడంతోనే

పెద్ద ఎత్తున కాలువకు నీళ్ల వదులుతున్నప్పుడు ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయో అని పరిశీలించవలసిన అధికారులు ఈ రోజు వరకు తొంగిచూడలేదు. ఇక రైతుల విషయానికి వస్తే కాలువకు గండికొట్టడం ద్వారా ప్రవహిస్తున్న ఈ జలాలు గ్రామానికి కిందివైపు ఉన్న పొలాల రైతులకు ఉపయోగపడవు. ఈ నీరు వాగు వెంబడి ప్రవహించి కుందూనదిలో వృథాగా కలసిపోతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సూత్రదారులపై చర్యలు తీసుకుని కాలువకు పడిన గండిని పూడ్చి లీకేజీని ఆరికట్టి నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఉద్యమం చేస్తాం

కొండాపురం : విద్యుత్ చార్జీల పెంపును వెంటనే విరమించుకోవాలని లేకుంటే ఉద్యమం చేస్తామని సీపీఐ మండల కార్యదర్శి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేసి వారు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యుత్ సంస్కరణ నేనే తెచ్చానని సంకలుగుద్దుకోవడంకాదు ఆ సంస్కరణలు ప్రజలపైన పెనుబారాలుగా మారుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయం మానుకునే స్థితి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ అంటే మొబైల్ లాంటిదే అని ముందు రీచార్జ్ చేసుకుంటే విద్యుత్ సరఫరా ఉంటుంది లేకపోతే సరఫరా నిలిపివేస్తారన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని విద్యుత్ సంస్థలతో ఆదానీ ఒప్పందాలు రద్దుచేయాలని ఈనెల 5 వతేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఏపీ ఎన్జీఓ ఎన్నిక ఏకగ్రీవం

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సిద్దవటం తాలూకా యూనిట్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా జె.సుబ్బరాయుడు, సహ అధ్యక్షుడిగా వై.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్.యానాదయ్య, పి.భాస్కర్‌రెడ్డి, శారద, కె.పవన్‌కుమార్, కార్యదర్శిగా సి.హైమావతి, జాయింట్ సెక్రటరీలుగా అంజనమ్మ, సల్మాన్‌రాజు, లక్ష్మినరసింహా, వెంకటరమణ, కోశాధికారిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా తిమ్మారెడ్డి, సహాయ ఎన్నికల అదికారి పోల్‌రెడ్డి, పరిశీలకులుగా రవికుమార్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసులు నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.